సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



ప్రాణం తీసిన ఈత సరదా

ఈత కొడదామనే సరదా కడప నగరంలో ఇద్దరు బాలల ప్రాణం తీసింది. నీటి కుంట లోకి దిగి ఊపిరాడక తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. -IIIలో



‘గోకులం’లో నవశకం

మేలు జాతి పశువుల వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించి పెయ్య దూడల ఉత్పత్తికి ప్రభుత్వం చేయూత ఇవ్వడంతో పాడి రైతు ఇంట నవశకం మొదలైంది. -IVలో

గరిష్ఠం/కనిష్ఠం
35.4/21.8

వాతావరణం

జిల్లాలో శనివారం 21.8 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా టీచర్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వ సభ్య సమావేశాన్ని 15న ఆదివారం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డి తెలిపారు. కడపలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు సభ్యులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

16న రోలర్ స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: ఈ నెల 16వ తేదీన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్‌కు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ఇజ్రాయిల్ తెలిపారు. వైవీయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉదయం 6 గంటలకు ఎంపికల్లో భాగంగా రోడ్ రేస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రింక్ రేసును నగరంలోని డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు విశాఖ పట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో అడ్మిషన్లు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, ఎర్త్‌సైన్స్, అప్లైడ్ జియాలజీ) కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులు కోర్సులో ప్రవేశాలకు అర్హులన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఉంటుందన్నారు. పది, ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఫొటోలతో వైవీయూలోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నమామి మాతా...నారాయణి!

‘అయిగిరి నందిని నందిత మేదిని విశ్వవినోదిని నందినుతే.. గిరివరవింధ్య శిరోధిని వాసిని విష్ణు విలాసిని జిష్ణునుతే...’’ అంటూ భక్తులు వేడుకోగానే మొర ఆలకించి ఆదుకునే జగజ్జనని అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణాలు, పల్లెలు ముస్తాబయ్యాయి. హిందువులు జరుపుకొనే ముఖ్యమైన పండగలలో దసరా ఒకటి. చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా జిల్లాలోని 500కు పైగా ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి 23వ తేదీ వరకు నవరాత్రుల్లో అమ్మవారిని అలంకరించి ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిట లాడనున్నాయి.

- ఆదివారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం
- 500కు పైగా ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబు
- ప్రొద్దుటూరులో భారీ పందిరి, సెట్టింగ్‌లు ఏర్పాటు

కడప కల్చరల్: వైఎస్ఆర్ జిల్లాలో ప్రధానంగా దసరా అంటేనే ప్రొద్దుటూరు గుర్తుకు వస్తుంది. ఇక్కడి ఉత్సవాల నిర్వహణ మైసూరు ఉత్సవాలను తలపిస్తుంది. ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి కొలువుదీరిన ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఆలయంతోపాటు బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల్లోని అమ్మవారిశాలల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. నేతన్నలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చౌడేశ్వరీ మాతను ఆరాధించి పది రోజులపాటు పూజలు నిర్వహిస్తారు. గ్రామాలు, మండలాల స్థాయి నుంచి పట్టణాల వరకు గంగమ్మ, బాల పోలేరమ్మ, సుంకులమ్మ తదితర గ్రామ దేవతల పేర్లతోగల ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలో శనివారం నాటికే నవరాత్రి శోభ సంతరించుకుంది. ఆలయ వీధులన్నీ రంగు రంగుల విద్యుద్దీపాలు, భారీ హోర్డింగ్‌లు, అమ్మవారి రూపాలతో అలంకరించారు. పెద్ద ఆలయాల వద్ద రాజ భవనాలను తలపించే ఆర్చీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కొన్నిచోట్ల మట్టితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల అనంతరం సమీపంలోని కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు విద్యుత్తు, పారిశుద్ధ్యం, పోలీసు, ఆరోగ్యశాఖలను పండుగకు సహకరించడంలో ముందుండాలని సూచించడంతో ఆయా శాఖల అధికారులు కార్యాచరణకు దిగారు.



ప్రొద్దుటూరు కన్యకా పరమేశ్వరీ అమ్మవారిశాల వద్ద కలకత్తా కళాకారులు వేసిన పందిరి

నవరాత్రి శోభ

కడప కల్చరల్: కడప నగరం నవరాత్రి శోభతో కళకళలాడుతోంది. అమ్మవారి ఆలయాలు గల వీధులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో వెలిగిపోతున్నాయి. ప్రధాన రోడ్లు కూడా కొద్ది మేరకు విద్యుత్ దీప శోభను సంతరించుకున్నాయి. బాల పోలేరమ్మ ఆలయం నుంచి అమ్మవారిశాల వరకు దాదాపు వంద మీటర్లు, గడ్డిబజారులో 150 మీటర్లకు పైగా, హనుమప్పవీధి తదితర వీధులు కూడా పూర్తిగా విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. ఆయా ప్రాంతాలలో మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న రోడ్డు పనులను ఉత్సవాల కోసం మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీ విజయదుర్గాదేవి ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి

23న గుండ ప్రవేశం



గర్భగుడిలో కొలువైన అమ్మవారు

రాజంపేట టౌన్: రాజంపేట కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారిశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భారీ సెట్టింగ్‌లతో అలంకరించారు. ప్రధాన కూడలిలో విద్యుత్తు దీపాలతో దేవతా మూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఆదివారం తొలిరోజున కన్యకా పరమేశ్వరీ అమ్మవారు దీక్షాబంధన దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 16న బిల్వవృక్ష నివాసినీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న కృష్ణ మూర్తి, 19న మోహినీదేవి, 20న సరస్వతీదేవి, 21న మీనాక్షి దేవి, 22న మహిషాసురమర్దిని, 23న మహాలక్ష్మీ దేవి, 24న రాజరాజేశ్వరీదేవి, 25న ఊంజల్ దేవిగా అలంకరిస్తారు. 20న బిందె సేవ, గ్రామోత్సవం, 22న దున్నపోతు మెరవణి, 23న గుండ ప్రవేశం, 24న తొట్టి మెరవణి ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి.

వందేళ్ల ఆలయంలో...

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని వాసవీ భవన్‌వీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం జిల్లాలోని అత్యంత పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆలయాల్లో ఒకటి. ఇక్కడ ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయాన్ని 12 ఏళ్ల కిందట పునర్నిర్మించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. 15న మీనాక్షిదేవిగా అలంకరించి తొలి రోజున పూజ చేస్తారు. 16న వాసవాంబగా, 17న గాయిత్రీదేవిగా, 18న అన్నపూర్ణాదేవిగా, 19న శ్రీ కాళింగమర్ధినిగా, 20న సరస్వతిగా, 21న రాజరాజేశ్వరిగా, 22న మహిషాసురమర్ధినిగా, 23న ధనలక్ష్మీదేవిగా అలంకరిస్తారు. 24న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ముస్తాబైన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం

పసిడి పురికి.. ఉత్సవ కళ

ప్రొద్దుటూరు కల్చరల్: మైసూరు తరువాత అంతటి ఖ్యాతి గడించిన పుత్తడిపురం ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు సిద్ధమైంది. ఆదివారం నుంచి 24వ తేదీ వరకు జరిగే దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రొద్దుటూరు పట్టణంలోని ఆలయాలను కలకత్తా సెట్టింగ్, స్పెషల్ డెకరేషన్ సెట్టింగ్, పందిరి, రంగురంగుల ఎల్ఈడీ లైటింగ్ సిస్టం, భారీ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడంతో ఉత్సవ శోభ సంతరించుకుంది. వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో స్పెషల్ కలకత్తా పందిరి ఏర్పాటు చేశారు. పట్టణానికి చిహ్నమైన అమ్మవారిశాల గాలిగోపురాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బెంగళూరు, కలకత్తా, తమిళనాడు, పూనాకు చెందిన కళాకారులు మరింత శోభ చేకూర్చేలా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం నుంచి 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు ఆదివారం ఉదయం 7.20 గంటలకు వేద పఠనంతో నవగంగ తీర్థములను తెచ్చి పూజలు ప్రారంభించనున్నారు. అనంతరం అమ్మవారి శాల నుంచి మంగళ వాయిద్యాలతో బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరీ దేవి పురాణాన్ని ఆర్య వైశ్యులు తీసుకురావడంతో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.



కదిలే ఆంజనేయస్వామి సెట్టింగ్

ప్రతి సామాజిక వర్గానికి న్యాయం



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

- కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవులు
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ. అంజద్ బాషా, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరుగుతుందని, ఉన్నత పదవులు దక్కుతాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాషా, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. స్థానిక రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అంజద్‌బాషా, అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎక్కువ మంది మైనార్టీలను శాసన మండలి సభ్యులుగా నియమించారన్నారు. ముస్లిం మైనార్టీ మహిళకు చైర్మన్ పదవి కల్పించారని, రాష్ట్రంలో 12 మంది కి చైర్మన్ పదవులు ఇచ్చారని ఈ సందర్భంగా చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన మదీనా దస్తగిరికి వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా పదవి ఇవ్వడం సంతోషించదగిన విషయమన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని నష్టాలు జరిగినా ఓర్చుకుంటూ జగనన్నను నమ్ముకొని దస్తగిరి తన రాజకీయ ప్రయాణం సాగించారన్నారు. జగనన్న ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని, ప్రస్తుతం జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులుగా పదవులు పొందిన వారు కష్టపడి పనిచేయాలని కోరారు. మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి సామాజిక వర్గానికి న్యాయం చేస్తున్నారన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి మాట్లాడుతూ పదవి రావడం తనకెంతో సంతోషంగా ఉందని, కష్టపడి పని చేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకొంటానని అన్నారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ సురేష్‌బాబు, రాష్ట్ర హజ్ హౌస్ చైర్మన్ గౌస్‌లాజం, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అఫ్జల్ ఖాన్, టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, హఫీసుల్లా, డాక్టర్ సొహైల్ అహమ్మద్ మాట్లాడారు.



వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మదీన దస్తగిరి

చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా షేక్ మదీనా దస్తగిరి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి, ఎంపీ, తదితరుల సమక్షంలో ఆయన ప్రమాణ పత్రం చదివారు. అనంతరం వైస్ చైర్మన్‌గా సయ్యద్ అలీ అక్బర్ (రిజ్వాన్), సభ్యులుగా పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, రూపనగుడి అబ్దుల్ సుభాన్, షేక్ గౌస్ పీర్, పఠాన్ ఖాదిరుల్లా, చింతపల్లి షాషావలి, ఇస్మాయిల్ సాబ్ గారి అన్వర్ సాబ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ మహమ్మద్ ఉమర్, షేక్ కరీ ముల్లా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మైనార్టీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొని ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, సభ్యులను పెద్ద ఎత్తున పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, నాయకులు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడలు ఆరంభం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానం వేదికగా ఆంధ్ర ప్రదేశ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కంచి వెంకటసుబ్బయ్య మెమోరియల్ ట్రస్టు సహకారంతో నిర్వహించిన ఈ పోటీలను స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ శనివారం ప్రారంభించారు. 13 జిల్లాల క్రీడాకారులు తొలుత ప్రముఖులకు గౌరవ వందనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సాయిగ్రేస్ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడ ఎంతో ప్రాచుర్యం కలిగిందని, క్రీడాకారులు ఉన్నత శ్రేణి ఆట ఆడాలని ఆకాంక్షించారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అత్యంత వేగవంతమైన రెండో క్రీడగా గుర్తింపుపొందిన హ్యాండ్‌బాల్‌కు గ్రామీణ స్థాయి నుంచి ప్రాచుర్యం కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.పి.అమృత్‌రాజ్, సత్యనారాయణరాజు, రాజారత్నం ఐజాక్, రోడామెర్సీ, దాతలు కంచి గోపీకృష్ణ, కంచి సురేంద్రనాథ్, సింధు, కార్పొరేటర్లు సూర్యనారాయణ, మల్లికార్జునకిరణ్, ఎ.సింధూరి, శివప్రసాద్, వెంకట సునీల్,పాల్గొన్నారు.

తొలి రోజున మ్యాచ్‌ల వివరాలిలా...

బాలుర విభాగం: కడప జట్టు 14-13 పాయింట్ల తేడాతో శ్రీకాకుళంపై, తూర్పుగోదావరి జట్టు 18-8 తేడాతో పశ్చిమగోదావరిపై, ప్రకాశంజట్టు 16-9తేడాతో అనంతపురంపై, గుంటూరు జట్టు 20-8 తేడాతో కృష్ణాపై గెలుపొందాయి.

సీనియర్ మహిళలు : కడప జట్టు 10-8 పాయింట్ల తేడాతో చిత్తూరు జట్టుపై, కర్నూలు జట్టు 13-02 పాయింట్లతో తూర్పుగోదావరి జట్టుపై, విజయనగరం జట్టు 9-0 తేడాతో నెల్లూరు జట్టుపై, కృష్ణా జట్టు 15-4 పాయింట్ల తేడాతో అనంతపురం జట్టుపై విజయం సాధించాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్



ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక



బ్యాడ్మింటన్ జట్టుతో అంతర్జాతీయ అంపైర్ జిలానీ బాషా, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సి.శారద

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీబాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడలో రాణిస్తున్నారన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి సి. శారద మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అరుణ, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-19 బాలుర జట్టు : ఎ.సాయినవీన్‌దత్తా, వై.వీఆర్. నిఖిల్‌కుమార్, పి.గణేష్‌నరసింహ, బి.శశికిరణ్, పి.శివశంకర్‌రెడ్డి.

అండర్-19 బాలుర జట్టు : ఆర్. రెడ్డిపద్మిణి, ఎస్.సాయినిఖిత, టి. జోత్స్న.









ఉత్సాహంగా జిల్లాస్థాయి

ఖోఖో ఎంపికలు



జిల్లా బాలికల జట్టు



జిల్లా బాలుర జట్టు

కడప స్పోర్ట్స్ : కడప యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ విభాగం ఖోఖో ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పెద్దసంఖ్యలో ఎంపికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఖోఖో క్రీడలో జిల్లాకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. ఖోఖో క్రీడాకారులకు అల్టిమేట్ ఖోఖోతో చక్కటి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి జె. నరేంద్ర మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమర్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు సుధీర్, ప్రతాప్‌లు క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపికచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వి. లక్ష్మణ్, నాగార్జున, రెడ్డయ్య, పవన్ కుమార్, కృష్ణయ్య, రవి, మల్లికార్జున, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బాలుర జట్టు : హరిప్రసాద్, రాఘవరాణా, సురేంద్ర, ముక్తుంసాబ్, చిన్నకృష్ణయ్య, నాగప్రసాద్, అశోక్, తరుణ్ నాక్, దీపక్‌కుమార్, గురువిష్ణు, అయ్యబాబు, ఇంద్ర, యతీష్, నిఖిల్, కిరణ్.

బాలికల జట్టు : వీరమ్మ, సాత్విక, దివ్య, నాగమణి, అలేఖ్య, ప్రజ్ఞ, వసంత, నందిని, ధరణి, యాస్మిన్, జె.కావ్య, బి.కావ్య, యోగరాయల్, స్రవంతి, ధరణి.

జర్నలిస్టులకు క్రీడలు అవసరం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్రకార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి

పులివెందుల టౌన్ : నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతూ విధులు నిర్వహించే పాత్రికేయులకు క్రీడలు చాలా అవసరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జర్నలిస్టుల షటిల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయన షటిల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఉపయోగపడతాయన్నారు. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లైస్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, వేంపల్లె సర్పంచ్ శ్రీనివాసులుతో పాటు జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, టోర్నీ కన్వీనర్ రమణారెడ్డి, టోర్నీ చైర్మన్ శ్రీనాథరెడ్డి, జర్నలిస్టులు, వైఎస్సార్సీపీ నాయకులు కడియాల లక్ష్మినారాయణ, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల ఫలితాలు

మొత్తం 25 జిల్లాలకు సంబంధించి 20 జట్లు పాల్గొనగా, శనివారం మొదటి రోజు జరిగిన పోటీలలో అతిథ్య పులివెందుల జట్టు, వెస్ట్‌గోదావరి, బాపట్ల సెమీఫైనల్‌కు చేరగా, ఇంకో సెమీ ఫైనల్ స్థానం కోసం అన్నమయ్య, నెల్లూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌లో తలపడనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని కొత్త రోడ్డు సమీపంలో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద శనివారం ఓమ్నీ వాహనం, ఆటో ఢీ కొన్నాయి. సీకేదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు కడప వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న ఆటోను రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న ఓమ్నీ వాహనం ఢీ కొందన్నారు. ఈ ప్రమాదంలో ఖాజీపేటకు చెందిన ఆటో డ్రైవర్ శివారెడ్డితో పాటు ఓమ్నీలో ఉన్న చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లికి చెందిన నారాయణ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇరువురిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.









క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతిచెందిన రైతు వెంకటరామిరెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని కడప నాగయ్యపల్లె గ్రామంలో శనివారం వేకువజామున జరిగిన విద్యుత్ ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ రోషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నాగయ్యపల్లెకు చెందిన వెంకటరామిరెడ్డి (58) తన కుమారుడైన కరుణాకర్‌రెడ్డితో కలిసి గ్రామ సమీపంలో ఉన్న తన పంట పొలానికి నీరు కట్టేందుకు వెళ్లాడు. అక్కడ మోటారుకు సంబంధించిన వైర్ తెగిపడి ఉండడంతో అది గమనించని రైతు అక్కడికి వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూలిపనులకు వచ్చి..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీపరిధిలో గల జగనన్న కాలనీలో శుక్రవారం కూలిపనుల నిమిత్తం వచ్చిన రాజేష్ (30)అనేవ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సీకేదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు మృతి చెందిన వ్యక్తిది కైకలూరు కాగా జీవనోపాధి నిమిత్తం రోడ్డుక్రిష్ణాపురంలో ఒక అద్దె గృహంలో భార్యతో పాటు జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం పనులకు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో..



మృతిచెందిన రత్నం (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జయమ్మ కాలనీకి చెందిన రత్నం (55) శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న రత్నం కూలిపనులకు వెళ్తుండేవాడు. ఆయన భార్య 15 సంవత్సరాల క్రితమే మృతి చెందింది. ఈయనకు నలుగురు పిల్లలు. ముగ్గురికి వివాహం చేశాడు. మద్యం మత్తులో ఉరి వేసుకుని చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి



తలారి రాంప్రసాద్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్: ముద్దనూరు రహదారిలో ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడ్డ సంఘటనలో సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన తలారి రాంప్రసాద్ (26) శనివారం సాయంత్రం అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ ఏఎస్‌ఐ మురళీ యాదవ్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. తలారి రాంప్రసాద్ శనివారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఎరువు తీసుకెళ్లి ముద్దనూరులో రైతుకు అప్పగించి తిరిగి ఖాళీ ట్రాక్టర్‌తో స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలోని చిటిమిటిచింత (పాటి) గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాగా, ప్రమాదం జరిగిన సమయంలో ఆ మార్గంలో వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి కిందపడిపోయిన డ్రైవర్‌ను పరిశీలించారు. అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకుని తనే దగ్గరుండి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నీటి కుంటలో పడి ఇద్దరి మృతి
- అన్నదమ్ముల పిల్లలే కావడంతో తీవ్ర విషాదం
- కడప తిలక్‌నగర్‌లో మిన్నంటిన రోదనలు



వెంకటసాయి, సుంకర శంకర్ మృతదేహాలు



నీటికుంటలో మృతదేహాల కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు, పరిశీలిస్తున్న రిమ్స్ ఎస్‌ఐ నారాయణ (ఇన్‌సెట్) వెంకటసాయి, సుంకర శంకర్ (ఫైల్)

కడప అర్బన్ : దసరా సెలవులు ఇచ్చారు.. సరదాగా ఈత కొడదామని అన్నదమ్ముల పిల్లలు ఐదుగురు కలిసి వెళ్లారు. వీరిలో ఇద్దరు నీటి కుంటలోకి దిగి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ప్రమాదం గురించి స్థానికులు, పోలీసులు సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకునేసరికి సుంకర శంకర్ అలియాస్ జనార్దన్ అలియాస్ జగన్(14), సుంకర వెంకటసాయి(14) మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి కడప రిమ్స్ పోలీసులు, పిల్లల బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగర శివార్లలోని తిలక్‌నగర్‌కు చెందిన సుంకర వెంకటమ్మ, పెంచలయ్య కుమారుడైన సుంకర శంకర్ ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో 9వ తరగతి చదువుతున్నాడు. పెంచలయ్య సోదరుడైన సుంకర శ్రీను కుమారుడు సుంకర వెంకటసాయి(14) కూడా కడపలో 9వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరితో పాటు స్థానికంగా ఉన్న సూరి, వెంకటరెడ్డి, కాశీ అనే పిల్లలు మొత్తం ఐదుగురు చలమారెడ్డి పల్లె సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లారు. మట్టి కోసం చాలా సంవత్సరాల క్రితం మట్టికుంటకు గుంత తీశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. వెళ్లిన ఐదుగురు పిల్లలలో సుంకర శంకర్, వెంకటసాయిలు సరదాగా నీటికుంటలోకి ఈత కోసం దిగి బురదలో ఇరుక్కుపోయారు. అంతే కేకలు వేస్తూ రోదించారు. చివరికి మునిగిపోయారు. గుంతలోకి దిగని సూరి, వెంకటరెడ్డి, కాశీ అనే ముగ్గురు పిల్లలు కేకలు వేశారు. ఈ విషయాన్ని తమ పెద్దలకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. రిమ్స్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ నారాయణ స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లను పిలిపించి టైర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మొదట శంకర్ మృతదేహాన్ని తరువాత వెంకటసాయి మృతదేహాన్ని వెలికి తీశారు. అన్నదమ్ముల పిల్లలే కావడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తిలక్ నగర్‌లో విషాదం నెలకొంది. మృతదేహాలను కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

పితృదేవతలకు సామూహిక పిండ ప్రదానం



రుద్రపాదం వద్ద నిర్వహించిన సామూహిక పిండ ప్రదానంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలవారు



రుద్రపాదం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వల్లూరు : మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండపై పెన్నా నది ఒడ్డున శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం సమీపంలోని రుద్రపాదం వద్ద శనివారం పితృ దేవతలకు సామూహిక పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలి వచ్చిన వారు తమ పితృ దేవతలకు, బంధువులకు, మిత్రులకు పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పిండ ప్రదానం చేయడం వలన కలిగే లాభాలను గురించి వివరించారు. పంచ నదీ సంగమమైన పినాకినీ నది తీరంలో అనేక యుగాలుగా వెలసిన రుద్రపాదం వద్ద పితృ దేవతలకు పిండ ప్రదానం నిర్వహించడం వలన పితృ దేవతలకు స్వర్గ ప్రాప్తి లభిస్తుందని అనేక పురాణాల్లో పేర్కొన్నారు. ఈ కార్యం చాలా సత్ఫలితాలను ఇస్తుందని, పితృ శాపాలు తొలగి ఆ కుటుంబాల్లో సుఖ సంతోషాలు వెల్లి విరుస్తాయన్నారు. ఈ కార్యాన్ని మనిషి దైనందిన విధుల్లో ఒక భాగంగా గుర్తించి ప్రతి ఒక్కరూ తన కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. దేవస్థానం తరుపున పిండ ప్రదాన సామగ్రిని ఉచితంగా అందచేశారు. కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడే వారికి కుర్చీలను ఏర్పాటు చేశారు. అనంతరం నదిలో స్నానాలు చేసి రుద్రపాదానికి అభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అఖిల్ దీక్షితులు, సుమంత్ దీక్షితులు, సునీల్‌కుమార్ ఆచార్యులు, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో దొంగతనాలకు చెక్

- దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేసే అవకాశం
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సూచన



కడప అర్బన్ : జిల్లాలోని ప్రజలు పోలీసుశాఖ అందిస్తున్న లాక్డ్ హౌస్‌మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టేందుకు సహకరించాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,54,492 మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేర్లను నమోదు చేసుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈమేరకు జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను మొబైల్‌ఫోన్‌తో అనుసంధానం చేసుకుంటే ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా నిశ్చింతగా వెళ్లవచ్చన్నారు. పోలీస్ స్టేషన్‌ల ద్వారా నిఘా ఉంచి, దొంగలు ఇంట్లోకి వస్తే ఇట్టే పట్టేసే అవకాశం యాప్ వినియోగం ద్వారా లభిస్తుందన్నారు. అండ్రాయిడ్ మొబైల్ ఫోన్ కలిగిన వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఊర్లకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటిలో కెమెరా అమర్చి దొంగలు చోరీలకు పాల్పడితే తక్షణమే పట్టుకునే అవకాశం లభిస్తుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



విష్ణు మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్రాస్ రోడ్డులో 'గూగుల్ వాటర్ సర్వీసెస్'లో వాటర్‌బాయ్‌గా పనిచేస్తున్న కత్తి విష్ణు(14) అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అట్లూరు మండలం సురాయపల్లెకు చెందిన కత్తి పెంచలమ్మ, భీమయ్యల కుమారుడైన విష్ణు, దేవునికడపలోని తమ అక్క దగ్గర వుంటూ, మద్రాస్ రోడ్‌లో 'గూగుల్ వాటర్ సర్వీసెస్' వాటర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఉన్నట్లుండి విష్ణు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని అతని తల్లి కత్తి పెంచలమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చేలోపు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తీసుకుని వెళ్లారు. మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సిద్దయ్య తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



మృతిచెందిన లక్ష్మి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని మారుతిహాల్ రోడ్డులో నివాసముంటున్న లక్ష్మి అనే మహిళ (31) శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బద్వేలుకు చెందిన లక్ష్మికి పులివెందులకు చెందిన మధుసూదన్‌తో 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేకపోవడంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇక తనకు పిల్లలు పుట్టరని తెలుసుకుని జీవితం మీద విరక్తి చెంది ఉరి వేసుకుని మృతిచెందింది.

ప్రొద్దుటూరును జూదరహితంగా తీర్చిదిద్దాలి

ప్రజాప్రతినిధులతో కలిసి ఎస్పీకి విన్నవించిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ఎస్పీ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

కడప అర్బన్ : ప్రొద్దుటూరును రాబోయే మూడు నెలల్లో జూదరహిత నియోజక వర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కోసం ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, పద్మశాలీయ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జింకా విజయలక్ష్మి, ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవిలతో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాగేంద్రారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు మొత్తం 100 మంది ప్రజాప్రతినిధులు శనివారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ఛలో ఎస్పీ ఆఫీస్' పేరుతో కడపలోని ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. జిల్లా ఎస్పీని కలిసి ప్రొద్దుటూరును జూదరహితంగా తీర్చిదిద్దాలని, ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం లాంటి రుగ్మతలను పెంచి పోషించడానికి గత టీడీపీ ప్రభుత్వ నిర్ణయాలే కారణమన్నారు. ప్రొద్దుటూరులో జరిగే అసాంఘిక కార్యకలాపాలకు తానే అధ్యుడనని టీడీ ఆరోపణలు చేస్తోందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరికన్నా భిన్నంగా ప్రొద్దుటూరు నియోజక వర్గ ప్రజల కోసం నిర్వహించామన్నారు. అప్పులు చేసి, ఆస్తులు అమ్మి అభివృద్ధి చేసిన సందర్భాలున్నాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తాము ఎప్పటికీ దూరంగా ఉంటామన్నారు. తనపై సీబీఐ విచారణ చేయాలని విశాఖకు వెళ్లి స్వయంగా కోరానన్నారు. రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని కోరుతున్నామన్నారు. తమ విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారన్నారు.

పోలీసులపై దాడి చేసిన దొంగల అరెస్టు



పట్టుబడిన దొంగలతో రూరల్ సీఐ, ఎస్‌ఐలు

పులివెందుల రూరల్ : ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి సమయంలో పోలీసులపై దాడి చేసిన దొంగలను శనివారం అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ మద్దిలేటి ఆధ్వర్యంలో లింగాల, తొండూరు, సింహాద్రిపురం ఎస్‌ఐలు రవి కుమార్, హనుమంతు, రోషన్‌లు బృందంగా ఏర్పడి దొంగలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి సమయంలో పులివెందుల పట్టణంలోని ఆటో నగర్‌లో ఎలాంటి నెంబరు ప్లేటు లేని నల్లరంగు స్కార్పియో వాహనం కనబడటంతో పోలీసులు దానిని తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. అయితే వాహనంలోని దొంగలు ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో గస్తీలో ఉన్న పోలీసులు పులివెందుల కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే లింగాల ఎస్‌ఐతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్కార్పియో వాహనంలో దొంగలు పులివెందుల రింగురోడ్డు గుండా పార్నపల్లె వైపు వెళ్తున్నారని సమాచారం ఇచ్చారు. వాహనం పెద్దరంగాపురం, ఎర్రంరెడ్డిపల్లె మీదుగా అంకాలమ్మగూడూరు, కామసముద్రం గ్రామాల వైపు వెళ్లడంతో పోలీసులు జెడ్పీ హైస్కూల్ వద్ద వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. దుండగులు పోలీసు వాహనాన్ని గుద్ది గట్టిగా కేకలు వేస్తూ రాళ్లతో పోలీసులపై దాడి చేసి పారిపోయారు. లింగాల ఎస్‌ఐ రవికుమార్ ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సింహాద్రిపురంలో స్కార్పియో వాహనంలో దొంగలు అనుమానాస్పదంగా వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంతో పాటు రూ.1.50లక్షలు విలువ చేసే కేబుల్ వైరు, రూ.17,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇంకొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడులు

- నలుగురు క్రికెట్ బుకీలు, ఏడుగురు మట్కా నిర్వాహకులు అరెస్ట్
- 96,900 నగదు స్వాధీనం



లాడ్జీలలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఇండియా-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏకకాలంలో విస్తృతంగా దాడులు చేశారు. దాడిలో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.36,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మట్కా నిర్వాహకులపై కూడా పోలీసులు దాడులు చేశారు. ఏడుగురు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 60,900 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.

క్రికెట్ పందెగాళ్లకు కౌన్సిలింగ్

సబ్‌డివిజనల్‌లో క్రికెట్ పందేలతో పాటు ఇతర జూదాలు నిర్వహిస్తున్న వారిని ఏఎస్పీ ప్రేరణా కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. క్రికెట్ పందేలు, మట్కా, పేకాట ఆడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట ఆడితే ఉపేక్షించేది లేదని చెప్పారు. పట్టణంలోని అన్ని లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వారిని తనిఖీ చేశారు. తనిఖీల్లో సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డి, నారాయణయాదవ్, రమణారెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు భళా.!

కడప వైఎస్సార్ సర్కిల్:మారుతున్న సాంకేతిక కాలానికి అనుగుణంగా సడలింపు చేసుకుంటూ అత్యాధునిక బహుళప్రయోజనాలు కలిగిన తపాలాశాఖ వినూత్న సేవలను ప్రవేశపెడుతోంది.

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్..

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్, ద్వారా దేశ విదేశాలలో నివసిస్తున్న ఎన్‌ఆర్‌ఐలకు వివిధ రకాల వస్తువులను 72 గంటల్లో పంపే సౌకర్యం తపాలాశాఖ కల్పిస్తోంది.

స్పీడ్ పోస్టు..

స్పీడు పోస్ట్ సౌకర్యం ప్రపంచీకరణలో భాగంగా విస్తృతమైనది. ప్రైవేట్ కొరియర్ల కన్నా నమ్మకంగా, వేగవంతంగా బట్వాడా జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, బీమా, బ్యాంకింగ్, చిట్‌ఫండ్ కంపెనీలు పూర్తిగా స్పీడ్ పోస్టు పైనే ఆధారపడుతున్నాయి.

కోర్ బ్యాంకింగ్ సేవలు..

కోర్ బ్యాంకింగ్ సేవలు 2014లో దేశ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. దీంతో సేవింగ్స్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి.

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ (ఎంఎంటీఎస్)

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా అత్యవసరంగా డబ్బును తేలికగా ఇతరులకు పంపే సౌకర్యం కలదు. డబ్బు పంపాల్సిన వ్యక్తికి మొబైల్ ద్వారా మేసేజ్ వెళ్తుంది. వెంటనే అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయానికి వెళ్లి తక్షణమే డబ్బులు పొందవచ్చు.

ఈ ఎంఓ..

ఎలక్ట్రానిక్ ఈ ఎంఓ ద్వారా డబ్బులు వేగంగా పంపే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సీఓడీ..

క్యాష్ అండ్ డెలివరి సీఓడీ అమలులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో సంప్రదించిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఆయా వస్తువులను సీఓడీ ద్వారా పొందవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన..

అప్పుడే పుట్టిన ఆడపిల్ల నుంచి పదేళ్లలోపు బాలికల తరుపున వారి తల్లి లేదా తండ్రి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు పొందవచ్చు. సంవత్సరంలో వెయ్యి నుంచి రూ. లక్ష వరకు పొదుపు డిపాజిట్ చేసుకోవచ్చు. జిల్లాలో 49965 ఖాతాలు ఉన్నాయి.

టీటీడీ దర్శన టికెట్లు..

గతంలో తిరుపతికి వెళ్లే భక్తులకు జిల్లా కేంద్రాల్లోనే దర్శన టికెట్లు అందుబాటులో ఉండేవి. రూ.300 చెల్లించి దర్శన టికెట్లు ఇక్కడి నుంచే పొందే అవకాశం తపాలా శాఖ కల్పిస్తోంది.

ఇవే కాకుండా మైస్టాంప్..మైఫొటో అనే వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజల ఫొటోలతో తపాలా బిళ్లను ముద్రించుకునే అవకాశం,ఎల్‌ఈడీ సౌకర్యం ద్వారా వివిధ వ్యాపార ప్రకటనలను చూసుకునే అవకాశం మీడియా పోస్ట్ ద్వారా లభించింది. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన, పాస్‌పోర్టు సేవలు, పోస్టల్ బ్యాంకు సేవలు, ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు స్టాంపుల సేకరణలో ఆసక్తి ఉన్నవారికి అనుకూలంగా అందమైన బొమ్మలతో రంగు రంగుల పోస్టల్ స్టాంప్‌లు ముద్రించి విక్రయిస్తారు. వీటిని లక్షలు, కోట్లు వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తపాలాశాఖ అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ పథకాలను వారి సంక్షేమం కోసం వినియోగించుకోవాలి. ఈ పథకాలు ఎంతో మేలు చేస్తాయి. – విజయ్ భాస్కర్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, కడప డివిజన్

• సిగ్నేచర్ స్పైడర్



యోగివేమన విశ్వవిద్యాలయం పర్యావరణ సమతుల్యతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. విభిన్న వృక్షజాతులు, అరుదైన కీటకాలకు నిలయంగా ఉన్న వైవీయూ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన సిగ్నేచర్ స్పైడర్ కనిపించింది. సంతకం చేసే క్రమంలో ఉంచే ఇంటూ (××) పోలిన విధంగా, జిగ్‌జాగ్‌గా స్పైడర్ తన గూడును ఏర్పాటు చేస్తుంది. చిన్నచిన్న కీటకాలను తింటూ జీవనం సాగించే ఈ కీటకం పర్యావరణ సమతుల్యతకు సంకేతంగా భావిస్తారు. ఇండియా, పాకిస్తాన్, శ్రీలంక, మాల్దీవుల ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయని వైవీయూ బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆర్జైడై కుటుంబానికి చెందిన ఆర్గియోపే అనసూజ దీని శాస్త్రీయనామం. – వైవీయూ

క్లుప్తంగా

నవోదయ దరఖాస్తుకు 31వ తేదీ ఆఖరు

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి 2024 ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యన్.విశ్వనాథ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 9వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మే 1, 2009 నుంచి జూలై 31 2011మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలన్నారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. పరీక్ష 2024 ఫిబ్రవరి 10వ తేదీన ఉంటుందన్నారు.

బ్రహ్మంగారి మఠానికి కర్ణాటక బస్సు

బ్రహ్మంగారిమఠం: పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి బెంగుళూరు నుంచి కర్ణాటక ఆర్టీసీ నడుపుతున్నట్లు మఠం నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు బస్సు బెంగుళూరు నుంచి బయలుదేరి పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, లింగాలదిన్నెపల్లె మీదుగా మరుసటి రోజున రాత్రి ఆరు గంటలకు బి.మఠం చేరుకుంటుందన్నారు. అదే రోజున రాత్రి ఎనిమిది గంటలకు బి.మఠం నుంచి బయలుదేరి మరుసటి రోజున ఉదయం ఆరు గంటలకు బెంగుళూరు చేరుతుందని దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతి వెలిగించేందుకు కృషి చేయాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక గ్లోబర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 3–8 సంవత్సరాల పిల్లలకు చదవడం, రాయడం నేర్పడంతోపాటు చదుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడమే శిక్షణ ఉద్దేశ్యం అన్నారు. పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను అంగన్‌వాడీ స్థాయి నుంచే తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులుగా అల్లం సత్యానారాయణ, నోడల్ అధికారిగా వాణిశ్రీ, పర్యవేక్షకురాలిగా ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఓ రామాంజనేయలురెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్లుగా చంద్ర ఓబుల్‌రెడ్డి, శోభారాణి, శ్రీహరి, నాగేశ్వరావు, సౌభాగ్యమ్మ, మదాలస, వరలక్ష్మి వ్యవహరించారు.

అధికారుల చొరవ.. రైతుకు న్యాయం



రైతు బైరప్పగారి లక్ష్మీనారాయణ

పెద్దతిప్పసముద్రం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ఓ రైతుకు సత్వరమే న్యాయం జరిగింది. మండలంలోని బొంతలవారిపల్లికి చెందిన రైతు లక్ష్మీనారాయణ మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి రూ.2.76 లక్షల సొమ్మును దశలవారీగా ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే ఓ వ్యక్తికి కంతుల రూపంలో చెల్లించాడు. ఆ వ్యక్తి పూర్తి మొత్తాన్ని సంస్థకు జమ చేయకుండా రూ.1.50 లక్షల సొమ్ము సొంత ప్రయోజనాలకు వాడుకున్నాడు. దీంతో ఫైనాన్స్ ప్రతినిధులు రైతును రూ.1.50 లక్షలు కంతులు ఇవ్వలేదని రైతు ట్రాక్టర్ తీసుకెళ్లారు. ఆ రైతు ఈ నెల 6న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్ ఎదుట తన గోడును వెళ్లబోసుకున్నారు. కలెక్టర్ స్పందించి ఎస్పీకి విన్నవించగా విచారించాలని ఆయన స్థానిక పోలీసులకు తెలిపారు. వెంటనే వారు ఫైనాన్స్ సిబ్బందిని పిలిపించి దస్త్రాలు పరిశీలించారు. వెంటనే రూ.3.50లక్షలు చెల్లించినట్లు ఎన్‌ఓసీ ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. ట్రాక్టర్‌ను రైతుకు అప్పగించారు.

ఐఓఎస్ అధికారుల తనిఖీ

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు గ్రామ పంచాయతీలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టాండర్డ్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. రైల్వేకోడూరుకు ఐఓఎస్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ గతంలో గ్రామ పంచాయతీ అధికారులు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఓ కో–ఆర్డినేటర్ సోనియా జోష్, తదితరులు గ్రామంలో తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికేషన్ పరిధికి లోబడి 70శాతం నిబంధనలు పాటిస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

పీలేరు రూరల్: ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) ప్రతినిధి సోనియా జోష్ అన్నారు. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కిలా ప్రతినిధులు శనివారం సందర్శించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ముఖాముఖి నిర్వహించారు. దస్త్రాల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎల్‌పీఓ నాగరాజ, సర్పంచ్ జీనత్ పాల్గొన్నారు.

గోకులంలో నవశకం

పాడి పశువుల వృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చేయూతనిస్తోంది. మేలు జాతి పశువుల వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించి పెయ్య దూడలను ఉత్పత్తి చేయిస్తోంది. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి పశువులలో పాల దిగుబడి పెంచే చర్యలు చేపడుతూ రైతు ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోంది.

- పాడిరైతుకు ప్రభుత్వం ఆర్థికఅండ
- అద్భుత ఫలితాలిస్తున్న కృత్రిమ గర్భధారణ పథకం
- పెయ్యదూడలతో పెరుగుతున్న ఆదాయం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పెరిగిన పాల దిగుబడి



గుర్రంకొండలో పాడి రైతు ఇంట జన్మించిన పెయ్యదూడ

సాక్షి, కడప డెస్క్: రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ పెయ్య దూడల సంతానోత్పత్తికి చర్యలు చేపట్టింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి మేలుజాతి పశువులు కొనుగోలు చేయడానికి వ్యయప్రయాస పడకుండా ఇక్కడే పెయ్యదూడల ఉత్పత్తికి సహకారం అందిస్తోంది. ఈ పథకాన్ని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. ఈ మేరకు రెండు జిల్లాల్లో దాదాపు 6000వేల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో తొలివిడత గర్భధారణ చేయించిన పశువులకు 90 శాతం మేర పెయ్య దూడలే జన్మించడం విశేషం. దీంతో పాడి రైతుల ఇంట ఆనందం వెల్లివిరిస్తోంది.

పథకం ఉద్దేశ్యం

మేలుజాతి పశు సంపదను త్వరితగతిన అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన. సాధారణంగా పశువులకు పెయ్య దూడలే పుడతాయనే నమ్మకం రైతుకు ఉండదు. గతంలో సాధారణ వీర్యనాళికల ద్వారా కృత్రిమ గర్భధారణ చేసినా పెయ్య దూడలు పుట్టే శాతం కొంత వరకే ఉండేది. కోడె దూడలు పుడితే ఉపయోగం ఉండదని భావించిన రైతులు వాటిని బయట విక్రయిస్తూ వచ్చారు. పాల ఉత్పత్తి లేక వారు నష్టపోయారు. ఇది గుర్తించిన ప్రభుత్వం మేలు జాతి పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని తీసుకువచ్చింది.

ప్రభుత్వ రాయితీ

పాడి పశువులకు 'లింగ నిర్ధారణ వీర్య సాంకేతిక పద్ధతి'లో కృత్రిమ గర్భధారణకు రూ.1350 ఖర్చవుతోంది. ఇందులో రైతు వాటాగా రూ.500 చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.850 రాయితీ ఇస్తుంది. ఈ క్రమంలో వీర్యనాళికలను రెండు డోసులుగా పశువులు లేదా ఆవులకు వేస్తారు. ఆవులు 9 నెలలకు, గేదెలు 10 నెలలకు ఈతకు వచ్చి పెయ్యదూడలు జన్మనిస్తాయి. కాగా, పశు సంవర్ధక అధికారులు తొలిసారి వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయిస్తారు. పశువు గర్భం దాల్చకపోతే రెండోసారి గర్భధారణ చేయిస్తారు. అప్పటికీ గర్భం దాల్చకపోతే రైతుకు సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు. అయితే తొలిసారి మగ దూడ పుట్టినా, ఒక వీర్య నాళిక తర్వాత రెండో నాళిక పశువుకు ఇవ్వకపోయినా సొమ్ము తిరిగి ఇవ్వరు. ఈ నేపథ్యంలో పథకం ప్రవేశపెట్టినపుడు ఎంపిక చేసిన గ్రామాల్లో పలువురు లబ్ధిదారులను గుర్తించారు. వారికి లింగ నిర్ధారణ వీర్య సాంకేతిక పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం ముర్రా, జెర్సీ, హెచ్.ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్.ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ మొదలైన మేలు జాతి పశువు లింగ నిర్ధారిత వీర్య నాళికలు వారికి అందుబాటులో ఉంచి కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే 90 శాతంపైగా పెయ్య దూడలు పుట్టి రైతుల ఇంట లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని ప్రస్తుతం రైతులతో పాటు పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, యస్.జి.ఓ మరియు ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకుంటున్నాయి. కొత్తగా ఎవరైనా ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటే సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చు.

మంచి పథకం అందించారు



పెయ్యదూడల ఉత్పత్తి పథకం చాలా బాగుంది. పాడిరైతులకు ప్రభుత్వం అందించిన వరమిది. గతంలో ఆవు/గేదె చూలు కట్టినప్పటి నుంచి ఏ దూడ పుడుతుందోనని బెంగ ఉండేది. అదృష్టం కొద్దీ పెయ్యదూడ పుడితే లాభంగా ఉండేంది. కోడె దూడ పుడితే పాడి రైతుకు ఎటువంటి లాభం ఉండేది కాదు. ఈ పథకం వచ్చిన తరువాత కచ్చితంగా పెయ్యదూడలే పుడతాయనే నమ్మకం వచ్చింది. – ఎన్. రమేష్, పాడిరైతు, చిన్నమండెం, అన్నమయ్య జిల్లా

పాల దిగుబడి పెంపు లక్ష్యం



పాలదిగుబడి పెంపు లక్ష్యాంగా ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చింది. రైతులు సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలి.

– డాక్టర్ జి.రమేష్, కార్యనిర్వహణాధికారి, వైఎస్సార్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

లక్ష్మీకళ వచ్చింది



పెయ్యదూడల పథకంతో మా ఇంట్లో పాడిఆవు పెయ్యదూడకు జన్మనిచ్చింది. దీంతో మా ఇంటికి లక్ష్మీకళ వచ్చినట్లయ్యింది. కోడె దూడలు పుడితే మాకు ఏమాత్రం లాభం ఉండదు. సరికదా పాల ఉత్పత్తి నష్టపోతాం. పెయ్యదూడలు పుడితే పాల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకం ద్వారా మేము ఎంతో బాగుపడుతాం. – అమరావతి, మహిళా పాడి రైతు, టి.చాకిబండ, అన్నమయ్య జిల్లా

చాలా సంతోషంగా ఉంది



నేను వ్యవసాయం చేసుకుంటూ 30 ఆవులను పెట్టి డైరీఫాంను నిర్వహిస్తున్నాను. జనవరి 20వ తేదీన మా ఆవుకు లింగనిర్ధారణ వీర్యం వేయించాను. కచ్చితంగా 9 నెలల 9 రోజులకు పెయ్యదూడకు జన్మనిచ్చింది. అది కూడా చాలా ఆరోగ్యంగా ఉంది. చాలా సంతోషంగా ఉంది.

– జి.సునిల్‌కుమార్‌రెడ్డి, కలసపాడు మండలం, కట్టకిందపల్లె, వైఎస్సార్ జిల్లా

శుభపరిణామం



ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి పెయ్యదూడల యూనిట్ రైతులకు అందించడం శుభపరిణామం. గతంలో కృత్రిమ గర్భధారణకు ఎంతో డబ్బు ఖర్చు చేసే వాళ్లం. ఒక వేళ చేసినా కచ్చితంగా పెయ్యదూడలే పుడతాయనే నమ్మకం ఉండేది కాదు. ఇప్పుడు కేవలం రూ.500తో ఈ పథకం అములు చేస్తున్నారు. మిగిలిన రూ.850 ప్రభుత్వమే రాయితీ భరించి మాకు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ పథకంతో ఎంతో మేలు జరుగుతోంది. – రామకృష్ణ, పాడిరైతు, దిగువగొట్టివీడు, అన్నమయ్య జిల్లా

ఎంతో మేలు చేస్తోంది



నేను జనవరి నెలలో నా పశువుకు సూది వేయించాను. ఇటీవలే అది పెయ్యదూడను ఈనింది. దూడ ఆరోగ్యంగా ఉంది. ఈ పథకంతో ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. – శంకర్‌రెడ్డి, బయనపల్లె, వీఎన్‌పల్లె మండలం, వైఎస్సార్ జిల్లా

మానవాళికి మార్గదర్శి ప్రవక్త మహమ్మద్

ప్రొద్దుటూరు కల్చరల్: మానవాళికి మార్గదర్శి ప్రవక్త మహమ్మద్ అని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహామండలి సభ్యులు కేఎంఎ.సుభాన్ తెలిపారు. స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ శాంతి ప్రదాత, అంతిమ దైవ ప్రవక్త మహనీయ మహమ్మద్ జీవితం ఆదర్శం అంశంపై ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచం ఎలాంటి విలువలను కోరుకుంటున్నదో ఆ విలువలను మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి అందించారని తెలిపారు. చెడు అలవాట్లను వదిలించుకోవాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రాంతీయ విభేదాలు, పురుష ఆధిపత్యం, మత ఆధిపత్యాన్ని ప్రవక్త తీవ్రంగా నిరసించారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో జీవిస్తే శాంతి, సామరస్యం, సోదర భావం విరాజిల్లుతాయన్నారు. జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మౌలానా ముజాహిద్ ఖాన్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మానవులతోపాటు అన్ని జీవుల పట్ల కారుణ్యం చూపారని, శత్రువులను క్షమించి వారి పట్ల దయను ప్రదర్శించారని చెప్పారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ అనేక మతాలు, కులాలు ఉన్న మన దేశంలో ప్రజలందరూ సోదరభావం, మత సామరస్యంతో జీవిస్తున్నారని తెలిపారు. న్యాయవాది సీవీ.సురేష్ మాట్లాడుతూ నేడు ప్రజలందరూ ప్రేమాభిమానాలు కోల్పోయి విద్వేషంతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రవక్త బోధనలు అనుసరిస్తే శాంతియుత జీవనం గడపవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మౌలాన గౌస్ మొహిద్దీన్ నిజామి, జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ అహ్మద్, పట్టణాధ్యక్షుడు షఫివుల్లా, డీఎం షరీఫ్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు కేఎంఏ సుభాన్



పాల్గొన్న ముస్లింలు

పూచీకత్తు సమర్పించిన టీడీపీ నాయకులు

మదనపల్లె: అంగళ్లు దాడి ఘటనలో నిందితులైన టీడీపీ నాయకులు హైకోర్టులో కండీషన్ బెయిల్ పొంది, అన్నమయ్య జిల్లా మదనపల్లి డీఎస్పీ కార్యాలయం, రూరల్ సర్కిల్ కార్యాలయంలో బెయిల్ పూచీకత్తును శనివారం సమర్పించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ రాజంపేట లోక్‌సభ స్థానం అభ్యర్థి గంటా నరహరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మతో పాటు నాయకులు మధుబాబు, దొరస్వామినాయుడు డీఎస్పీ కార్యాలయం చేరుకుని ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున జామీను, పదివేల రూపాయల పూచీకత్తు బెయిల్ పత్రాలను అందజేశారు. ముదివేడు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు(క్రైమ్ నంబరు 79/2023)లో డీఎస్పీ కేశప్ప ఎదుట హాజరై పూచీకత్తు సమర్పించారు. ఇదే ఘటనలో ఆయుధాల చట్టం కింద నమోదైన కేసు(క్రైమ్ నంబరు 74/2023)లో అమరనాథరెడ్డి, గంటా నరహరి రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ శివాంజనేయులు ఎదుట జామీను సమర్పించారు.



మదనపల్లె రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులు

నేటి నుంచి శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ క్రీడపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్, సాగర్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 6 గంటలకు హాజరు కావాలన్నారు.

అంగన్‌వాడీలకు మెడికల్ కిట్లు

- పిల్లల ఆరోగ్యంపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ
- జిల్లాలో 2389 కేంద్రాలకు కిట్లు అందజేత
- ఒక్కో కిట్‌లో 10 రకాల మందులు



కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పల్లెలు, వార్డుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విలేజ్, అర్బన్, హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో ఇంటింటికి వైద్యాన్ని చేరువ చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో సేవలు అందిస్తున్నారు. మరోవైపు మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 2389 అంగన్వాడీ కేంద్రాలకు ప్రాథమిక చికిత్స కిట్లను అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యను అభ్యసిస్తున్న 1,57,015 మంది చిన్నారులకు ఆరోగ్య భరోసా ప్రభుత్వం కల్పిస్తోంది. చిన్నారులు జ్వరం బారిన పడినా, ప్రమాదాలకు గురైనా వెంటనే వైద్యం అందేలా కిట్లలో 10 రకాల మందులను అందజేస్తున్నారు. అయోడిన్, బ్యాండేజ్, ఐరన్ మాత్రలు, బర్నాల్, కాటన్, డిజైన్, పారాసిటమాల్, చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యానికి అవసరమైన సిరప్‌లను కూడా అందజేస్తున్నారు. మందుల వినియోగంపై వైద్య సిబ్బంది ఇప్పటికే అవగాహన కల్పించారు.

ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ

ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయా కేంద్రాల పరిధిలోని సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి 3–4 రోజులకు పర్యవేక్షిస్తారు. వీరు కేంద్రాల్లోని చిన్నారులకు పెరుగుదల, బరువుపై పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారు.



అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన మందులు, సిరప్

అంగన్వాడీ కేంద్రాలు :	2389
గర్భిణులు :	14,888
బాలింతలు :	14,239
చిన్నారులు :	1,57,015

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాలకు మెడికల్‌కిట్లను అందజేయడం హర్షణీయం. కేంద్రంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. అనారోగ్య సమస్యలను వీటి ద్వారా అధిగమించాలి.

– సునంద, సీడీపీఓ, కడప

మెడికల్ కిట్లు ప్రయోజనకరం



అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల అనారోగ్య సమస్య నివారణకు మెడికల్ కిట్లు ప్రయోజనకరంగా ఉంటాయి. చిన్నపాటి గాయాలు తగిలినా, జ్వరం వచ్చినా, ఇతర స్వల్పకాలిక అనారోగ్య సమస్యలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు చర్మవ్యాధులు రాకుండా ఉండేందుకు ఆయింట్‌మెంట్లు సైతం అందించడం అభినందనీయం.

– ఎస్.వి.గ్లోరి, అంగన్వాడీ కార్యకర్త, కడప